# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాదిగారు మొట్టమొదటిసారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

Creativity is allowing yourself to make mistakes. Art is knowing which ones is to keep.

---------------Lawrence

**ఆంధ్రప్రభ వీక్లీలో సబ్ ఎడిటర్లుగా పనిచేసినవారు శార్వరి, ఎల్లోరా, రాజేంద్రలు.**

శ్రీ ఎల్లోరా నాకు మొదట ఆయన పేరు ద్వారానే పరిచయం. తర్వాత ఓ సాయంత్రం ఆర్టీసి క్రాస్ రోడ్స్‌లోని క్రిస్టల్ బార్‌లో ముఖాముఖి పరిచయం. 1977లో నేను దాదాపు ప్రతి సాయంత్రం ఆ బార్‌కి వెళ్ళేవాడిని. ఓ సాయంత్రం రచయితలు శ్రీ వి.రాజా రామ్మోహనరావు, యర్రంసెట్టి సాయి నాకు అక్కడ తారసపడ్డారు. మరో ఇద్దరు రచయితలు కూడా ఉన్నారు. పేర్లు గుర్తులేవు. శ్రీ రామ్మోహనరావు అక్కడికి ఐదు నిమిషాల కాలినడక దూరంలో ఓ ఇంట్లో అద్దెకి ఉండేవారు. శ్రీ ఎల్లోరాని అతను నాకు పరిచయం చేసారు. వెంటనే ఎల్లోరా చెప్పారు.

"మీరు ప్రభకి పంపిన 'అద్దెకిచ్చిన హృదయాలు' అనే చిన్న సీరియల్ రాత ప్రతిని నేనే మొదట చదివి, దాన్ని వెంటనే షెడ్యూల్ చేసి ప్రచురించాను".

అది నిజమే. నేను పంపిన ఐదారు వారాలకల్లా అది ప్రభలో మొదలైంది. నేను ఆయనకి థాంక్స్ చెప్పి వారి మధ్య నేను ఉండటం భావ్యం కాదని భావించి ఇంకో టేబుల్‌కి వెళ్ళిపోయాను. వాళ్ళు కూడా నన్ను తమతో ఉండమని చెప్పలేదు.

సన్నగా, పొట్టిగా ఉండే ఎల్లోరా లీలగా గుర్తున్నారు. ఆ తర్వాత మళ్ళీ వారిని నేను కలవలేదు.

శ్రీ శార్వరిని ఆంధ్రప్రభ వీక్లీలో నేను రచయిత కాక మునుపే 1968లో విజయవాడలో, గాంధీనగర్‌లోని రైల్వే స్టేషన్‌కి వెళ్ళే దారిలో కట్టిన మునిసిపల్ పార్క్‌లో చూశాను. నేనప్పుడు బి.కాం సెకండియర్ చదువుతున్నాను. నా మిత్రుడు దేవరకొండ మురళి పార్క్‌లో ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చుని కబుర్లు చెప్పుకునే ముగ్గురిలోని ఒకర్ని చూపించి ఆయనే ప్రభ ఎడిటర్ శార్వరి అని చెప్పాడు. తెల్లటి ఖద్దరు లుంగీ, లాల్చీ ధరించిన శార్వరి సన్నగా, పొట్టిగా ఉన్నారు. ఉద్యోగ రీత్యా నేను హైదరాబాద్‌కి వచ్చేసాక, 1974లో గాంధీ నగర్‌లో ఓ గదిలో అద్దెకి ఉండేవాడిని. నా గదికి ఎదురుగా గల ఓ పోర్షన్‌లో శ్రీ శార్వరి అద్దెకి ఉండేవారు. ఆయన్ని గుర్తుపట్టాను. కానీ ఎన్నడూ పలకరించలేదు.


శ్రీ శార్వరి




2001లో నేను ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక ఆసక్తితో కొన్న మొదటి ఆధ్యాత్మిక పుస్తకాలలో ఒకటి 'కుండలి'ని అనే తెలుగు పుస్తకం. దాని రచయిత శార్వరి. ఓ ఆధ్యాత్మిక మిత్రుడు శ్రీ శార్వరి సి.వి.వి మార్గంలో చాలా కాలంగా ధ్యానం చేస్తున్నారని చెపితే, ఆధ్యాత్మిక ఆసక్తితో ఆయన్ని చూడడానికి ఆ పుస్తకంలోని చిరునామా చూసి సికింద్రాబాద్ ఆల్వాల్ ప్రాంతంలోని ఆయనింటికి వెళ్ళాను. దాని పేరు ఏదో యోగాశ్రమం. నా పూర్తి పేరు చెప్పకుండా ఆయనతో మాట్లాడాను. ఆనాడు విజయవాడలో చూసినప్పుడు ఎట్లా ఉన్నారో అదే రకం దుస్తుల్లో, శారీరకంగా ఎలాంటి మార్పు లేకుండా శ్రీ శార్వరి అలాగే ఉన్నారు. మాస్టర్ సి.వి.వి. మంత్ర దీక్ష ఆయన ఇస్తున్నారని తెలిసి, దాని గురించి అడిగితే రెండున్నర వేల రూపాయలు మంత్ర దీక్షకి తీసుకుంటానని చెప్పారు. ఆయనలో అహం నాకు కొట్టొచ్చినట్లుగా కనిపించింది. మంత్ర దీక్షని అమ్మడం కూడా ఆధ్యాత్మికతలో పొసగదు. ఆయన విద్యార్థులతో పాటు కొద్దిసేపు ధ్యానం చేసుకుని వెళ్ళిపోయాను. ఆ తర్వాత మళ్ళీ నేను శ్రీ శార్వరిని కలవలేదు.

కొద్ది సంవత్సరాల తర్వాత ఆయన నుంచి వారు రాసిన ఆధ్యాత్మిక పుస్తకాల పార్సిల్ నాకు పోస్ట్‌లో అందింది. ఫ్రం అడ్రస్‌ని బట్టి వారే పంపారని అర్థమైంది. కానీ వాటిని ఎందుకు పంపారో తెలియలేదు. వాటిని నేను అమెరికాలోని హ్యూస్టన్‌కి వెళ్ళినప్పుడు అక్కడి మీనాక్షి ఆలయంలోని తెలుగు లైబ్రరీకి ఇచ్చాను.

శ్రీ రాజేంద్ర పేరు కూడా వినడమే తప్ప ఆయనతో నాకు ముఖాముఖి పరిచయం లేదు. 1983 - 1984లలో ఓసారి నేను అమీర్ పేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో బరువు తగ్గడానికి, ఆల్కహాల్‌కి దూరంగా ఉండటానికి రెండు వారాలు ఉన్నాను. ఓ రోజు శ్రీ రాజేంద్ర నా కాటేజ్‌కి వచ్చి తనని పరిచయం చేసుకున్నారు.

"నేను మీ ఇంటికి వెళితే, మీరు ఇక్కడ ఉన్నారని కాటేజ్ నంబర్ చెప్పారు. నా పేరు రాజేంద్ర. ఆంధ్రప్రభ వీక్లీలో నేను చాలా కాలంగా సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం ఇన్ ఛార్జ్ ఎడిటర్‌ని చేసారు. వీక్లీకి మీ సీరియల్ కావాలని అడగడానికి వచ్చాను. మీకు అన్ని వీక్లీలు సీరియల్‌కి పాతిక వేలు ఇస్తున్నాయని నాకు తెలుసు. మా పత్రిక ఐదు వేలకి మించి ఇవ్వదు. ఐనా మీరు సీరియల్ ఇస్తారనే ధైర్యంతో అడగడానికి వచ్చాను. పత్రిక సేల్స్ ఈ రోజుల్లో మీవి, వీరేంద్రనాథ్‌వి సీరియల్స్ వల్ల పెరుగుతున్నాయి. కాబట్టి అది కోరడానికి వచ్చాను. ఇది మీరు నాకు ఫ్రెండ్లీగా చేసే సహాయం." ఆయన అడిగారు.

నేను రచయితగా చేసిన తప్పులో మరొకటి అతని కోరికని మన్నించకపోవడం. అప్పట్లో ఇతరులకి సహాయం చేయాలి అనే ధోరణి నాలో ఉండేది కాదు. అన్ని పత్రికలు సీరియల్స్ అడిగి రాయించుకుంటున్నా అంతదాకా ప్రభ వీక్లీ ఎడిటర్స్ ఎవరూ నన్ను సీరియల్ అడగలేదనే అహంతో కూడిన కోపం కూడా ఉండేది.

"రాజేంద్రగారూ. మీరు ఫ్రెండ్లీగా అంటున్నారు. మనిద్దరం చిన్నప్పటి నుంచి మిత్రులం కాదు. ఒకే బెంచీలో కూర్చుని కలిసి చదువుకోలేదు. ప్రభ కూడా కమర్షియల్ రచయితగా నన్ను గుర్తించలేదు. మీకు రాస్తే నాకు ఇరవైవేల రూపాయల నష్టం కూడా వస్తుంది. మరి నేను మీకు ఎందుకు రాయాలో ఓ మంచి కారణం చెపుతారా?" అడిగాను.

మృదువుగా అడిగినా నా మాటల్లో తీక్షణత ఉంది.

"ఇది నా కెరీర్‌కి మీరు వ్యక్తిగతంగా చేసే సహాయం. ప్రభ సేల్స్ పెరిగితే మేనేజ్ మెంట్‌తో పారితోషికం పెంచే విషయం మీద మాట్లాడేందుకు నాకు పట్టు దొరుకుతుంది. ఇప్పుడు పారితోసికం గురించి మాట్లాడే చొరవ వారితో నాకు లేదు. తెలుగు వారపత్రికా రంగంలో వచ్చిన మార్పులు వారికి తెలీవు. చెప్పినా అర్థం చేసుకోలేరు. కాబట్టి ఇది మీరు నాకు ఫ్రెండ్లీగా కాకపోయినా వ్యక్తిగతంగా చేసే సహాయం అవుతుంది. దాన్ని ఆశించే వచ్చాను."

నేను నిరాకరించడంతో ఆయన మళ్ళీ ఆలోచించుకుని ఫోన్ చేస్తే వచ్చి కలుస్తానని వెళ్ళిపోయారు. నేను వారికి ఫోన్ చేయనేలేదు.

ఆ తర్వాత శ్రీ రాజేంద్ర ఇండియా టుడేలో చేరారని శ్రీ పాలకోడేటి సత్యనారాయణ రావు ఓ సందర్భంలో చెప్పారు. శ్రీ రాజేంద్ర చాలామందిని అడిగి ప్రత్యేకంగా ఇండియా టుడేలో కథలు రాయించి వేసుకునే వారు. నిజానికి అడిగి రాయించుకున్నవే వేసుకునేవారు. అప్పట్లో ఇండియా టుడే కథకులకి అత్యధిక పారితోషికం చెల్లించేది. కానీ శ్రీ రాజేంద్ర నన్ను ఎన్నడూ కథలు అడగలేదు. అందుకు ఆయనకి తగిన కారణం ఉంది కాబట్టి నాకు ఆయన మీద కోపం కూడా రాలేదు. కొద్ది కాలం తర్వాత శ్రీ రాజేంద్ర నాకు మల్కాజ్‌గిరిలోని ఒకరింటికి ఏదో ఫంక్షన్‌కి వెళితే అక్కడ తారసపడ్డారు. ఆయన ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆ తర్వాత ప్రత్యేక సంచికకి కథలని పంపమని వారినుంచి ఉత్తరం వచ్చింది. అలా మూడు సంవత్సరాలు ప్రత్యేక సంచికకి మూడు కథలు - చవక ప్రయాణం, అంతర్ముఖం, మరో కథ (పేరు గుర్తులేదు) అడిగి రాయించుకుని వాటిని ప్రచురించారు. ఆ తర్వాత శ్రీ రాజేంద్ర ఇండియా టుడే నుంచి రిటైరైపోయారు. మళ్ళీ ఆయన మల్కాజ్ గిరిలోని ఓ ఆధ్యాత్మిక భజనకి వెళ్ళినప్పుడు తారసపడ్డారు. మనిషి

బాగా వడలిపోయారు. ఇది వరకటి ఆప్యాయతతోనే మాట్లాడారు. ప్రభలో ఆయన ఎడిటర్‌గా పనిచేసినప్పుడు సీరియల్ రాసి ఉండాల్సింది అని, పొరపాటు చేసానని, క్షమించమని కోరితే ఆయనకసలు ఆ సంగతే గుర్తులేదు! నేను గుర్తుచేసాక చెప్పారు.

"అప్పుడే నేను మీరు చెప్పింది ఆలోచించాను. అది సబబే అనిపించింది. కాబట్టి క్షమాపణలాంటి పెద్ద మాటల అవసరం లేదు."

కొద్దికాలానికి ఆయన పోయారని పేపర్లో చదివాను.

శ్రీ రాజేంద్ర తర్వాత ఇండియా టుడే ఇన్ ఛార్జ్ ఎడిటర్స్‌గా శ్రీయుతులు రెంటాల జయదేవ, రాజశుకులు ఉన్నారు. కానీ వారు ఎన్నడూ నన్ను ఏ రచనలూ అడగలేదు. ఓసారి మాత్రం ఇండియా టుడే జర్నలిస్ట్ ఒకరు, పేరు గుర్తులేదు. నన్ను ఓ ట్రావెల్ ఆర్టికల్‌ని ప్రత్యేక సంచికకి రాయమని కోరారు. భద్రాచలం నుంచి పాపికొండల మీదుగా రాజమండ్రి దాకా పడవ ప్రయాణం చేసి ఆ అనుభూతిని వ్యాసంగా రాయమని, పారితోషికం కాక, అందుకు అయ్యే ఖర్చులు కూడా ఇస్తామని చెప్పారు. నాకు ఆసక్తి లేదని, భావుకత బాగా ఉన్న కుప్పిలి పద్మ పేరుని సూచించి, నాకన్నా ఆమె దీనికి ఎక్కువ న్యాయం చేయగలదని చెప్పారు. 'మీరు మాకు ఆల్టర్ నేటివ్‌ని సూచించక్కర్లేదు' అని అతను కొద్దిగా కఠినంగానే చెప్పాడు. మా మధ్య సంభాషణంతా ఇంగ్లీష్‌లోనే సాగింది. ఆ ఆర్టికల్‌ని కుప్పిలి పద్మగారే రాసారని గుర్తు.

●●●

***<u>రచన శాయి</u>***



1982లో హైద్రాబాద్‌లో చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరిగే ఓ సాహితీ కార్యక్రమానికి, నేను, నా అభిమాని నీలిమతో వెళ్ళాను. మా సంభాషణలని విన్న వెనక సీట్లోని ఓ వ్యక్తి నేను మల్లాదినని గ్రహించి, పలకరించి తను కూడా రచయితనని, వై.రాంబాబు, సాయి అనే జంట రచయితల్లో తను శాయినని చెప్పారు. వారి కథలు నేను చాలా చదివాను. కొత్తల్లో ఇద్దరం కలిసి రాసేవాళ్ళమని, కానీ రాంబాబు ఉద్యోగ రీత్యా దూరంగా ఉండటంతో తను మాత్రం రాస్తున్నా, తన మిత్రుడి పేరుని తీసేయలేదని కూడా చెప్పారు. కమర్షియల్ సీరియల్స్ అనేకం రాస్తున్నందుకు అభినందించారు.

"మీరు చందమామలో రాస్తున్నప్పటి నుంచీ మీ రచనలు చూస్తున్నాను. నా దగ్గర అన్ని పాత పత్రికలు ఉన్నాయి. మీ కథలు ఏమైనా ఏ పత్రికలో అయినా మిస్ అయితే వాటి జిరాక్స్ నేను ఇవ్వగలను." చెప్పారు.

"చందమామలో కొన్ని కథలు మిస్ అయ్యాయి. అవి ఉన్నాయా?" అడిగాను.

ఉన్నాయని చెప్పారు. తర్వాత చందమామలో వచ్చిన నా కథలని సంకలనంగా వేసినప్పుడు శ్రీ శాయి దగ్గర వాటిని తీసుకున్నాను. ఆయనకి తెలుగు సాహిత్యం మీద మంచి పేషన్ ఉందని ఆయన మాటలని బట్టి నాకు అర్థమైంది. అప్పట్లో వైజాగ్‌లో పోర్ట్ ప్రెస్‌లో అనుకుంటా ఆయన పనిచేసేవారు. జ్యోతి మాసపత్రిక మద్రాస్ నుంచి షిఫ్ట్ అయ్యాక చివర్లో దాన్ని మరొకరు కొనుక్కుని కొద్దికాలం నడిపించారు. అందులో శ్రీ శాయి మద్దతు కూడా ఉండేది. ఆఫీసుకి సెలవు పెట్టి వచ్చి హైద్రాబాద్‌లో జ్యోతి ఎడిటోరియల్ పనిని చూసేవారని గుర్తు. ఉద్యోగం విషయంలో శ్రీ శాయి మీద పై అధికారులు కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని కూడా ఓసారి చెప్పిన గుర్తు. తర్వాత ఆయన ఉద్యోగం వదులుకుని 1990లో అనుకుంటా రచన మంత్లీని హైదరాబాద్ నుంచి ఆరంభించారు. ఆయన కోరి కొన్ని కథలని రాయించుకున్నారు. నాకు గుర్తున్న ఓ మంచికథ, 'మంత్లీ మీల్స్ కూపన్స్'. పారితోషికం ఇవ్వలేనని ఆయన ముందే నిక్కచ్చిగా చెప్పారు. ఓసారి మా ఇంటికి వచ్చి ఏదైనా శీర్షికని నిర్వహించమని చెప్పారు. పజిల్ అయితే బావుంటుందని, ఆ పజిల్‌ని కూడా ఆయనే సూచించారు. దాని పేరు మూడు ప్రశ్నలు - ఒకే సమాధానం. ఆ మూడు ప్రశ్నలకి జవాబు ఒకటే అయి ఉంటుంది. దాన్ని పాఠకులు కనుక్కోగలగాలి అన్నది కాన్సెప్ట్. ఆ ప్రకారం నేను 'మూడు ప్రశ్నలు - ఒకే జవాబు' శీర్షికని ఒక ఏడాది దాకా

నిర్వహించాను. ఒకటి - రెండుసార్లు అది ఇంకాస్త కఠినంగా ఉంటే బావుంటుందని కూడా ఆయన నాకు సూచించారు. పాఠకులు మరీ కుస్తీపట్టకుండా, తాము విజయం సాధించామని తృప్తి చెందాలనేది నా దృక్పథం తప్ప, హెచ్చు మేథస్సుతో పోరాడటానికి ఎక్కువ సమయం వినియోగించడానికి పాఠకులు ఇష్టపడకపోవచ్చని శ్రీ శాయితో చెప్పాను.

1994లోనేను 'లిపి పబ్లికేషన్స్' ప్రచురణ సంస్థని స్థాపించి నా పుస్తకాలు నేనే ప్రచురించడం ఆరంభించాను. ఆ సందర్భంగా శ్రీ శాయిని లిపి పబ్లికేషన్స్‌కి క్వార్టర్ పేజీ ప్రకటన రచనలో ఉచితంగా ఇవ్వమని కోరాను. అది తమ పాలసీ కాదని, కుదరదని ఖండితంగా చెప్పారు. కమర్షియల్ రచయితగా ముద్రపడ్డ నేను కూడా పారితోషికం తీసుకోకుండా రాసే నిబంధనని 'రచన' విషయంలో సడలించినట్లుగా, శ్రీ శాయి నా విషయంలో సడలించనందుకు అలిగి ఇక వారికి నా కాంట్రిబ్యూషన్ మానేసాను.

దాదాపు పదిహేనేళ్ళ తర్వాత శ్రీ శాయి నాకు మళ్ళీ హైదరాబాద్ అజామాబాద్‌లోని చరిత ప్రింటింగ్ ప్రెస్‌లో కనపడ్డారు. ఆయనలో భౌతికంగా ఎలాంటి మార్పులేదు. పూర్వం నేను చూసినట్లే ఉన్నారు. రచన మంత్లీని ఆ ప్రెస్‌లోనే తను ముద్రిస్తున్నానని చెప్పారు. సదా సిగరెట్ తాగే ఆయన చేతిలో, ప్రెస్ కాబట్టి అనుకుంటా, సిగరెట్ లేదు.

ఆ ప్రెస్ యజమాని శ్రీ సుబ్బయ్య చాలా మంచి వ్యక్తి అని, మాట ప్రకారం పని జరుగుతుందని, ఆయన చాలా పెద్దమనిషి అని, తన పత్రిక అందులో ప్రింట్ అవుతున్నా తను అక్కడికి రావడం రెండోసారి అని శాయి చెప్పారు. తను ఉండేది రామ్ నగర్‌లోనే అనిచెప్పారు. ఆ తర్వాత ఏడాదికి అమెరికాకి చెందిన వంగూరి ఫౌండేషన్ శ్రీ చిట్టెన్ రాజు హిమాయత్ నగర్‌లోని ఉడ్‌లాండ్స్ హోటల్లో జరిపిన రచయితల గోష్టిలో, చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథల సంపుటి ఆవిష్కరణ సభలో శ్రీ శాయి తారసపడ్డారు.

ఇప్పుడు ఆయన ఇంటిపేరు 'రచన'గా మారింది. మన వాళ్ళు పత్రికలని చదువుతారు తప్ప కొనే అలవాటు లేదు కదా మరి! దాని నిర్వహణ కోసం ఆయన ఎన్నో ఆర్థిక కష్టాలని ఎదుర్కొన్నారని విన్నాను. ఆయన్ని ఉద్యోగంలోంచి తీసేసారో లేక స్వచ్ఛందంగా మానేసారో కాని రిటైర్ మెంట్ బెనిఫిట్స్‌గా వచ్చిన మొత్తాన్ని రచన మాసపత్రిక నిర్వహణకే ఖర్చు చేసేసారని, ఓ బంధువు పోతే కలిసి వచ్చిన ఆస్థిని కూడా దాని నిర్వహణకే ఖర్చు చేసారని జ్యోతిలో శాయితో పాటు పనిచేసిన బాల అనే ఓ మిత్రుడు చెప్పారు. శాయి దగ్గర పాత పత్రికలన్నీ భద్రంగా ఉండటంతో రచనకి ముడి సరుకు కోసం తడుముకోవాల్సిన అవసరంలేదు. కాళీపట్నం రామారావు మాష్టారు గారి కథా నిలయానికి చాలా పాతపత్రికలని, కథలని శ్రీ శాయి ఇచ్చారని మాష్టారుగారు ఓసారి నాతో చెప్పారు. బాపుగారికి కూడా శాయి అంటే అభిమానం. రచన శీర్షికలకి బొమ్మలని, రచన లోగోని ఆయన ఉచితంగా గీసి ఇచ్చారు. కొందరు ఎన్నారైలు, మరి కొందరు దేశీ సాహిత్యాభిమానులు కూడా రచన నిర్వహణకి సహాయం చేసారని విన్నాను. వసుంధరగారు 'సాహితీ వైద్యం', చిట్టెన్‌రాజుగారు, అమెరికాకమ్మ కబుర్లు.. ఇలా పలువురు రచన మీదగల అభిమానంతో దానికి ఉచితంగా రాస్తున్నారు. పట్టుదలకి, ముఖ్యంగా మొడిపట్టుదలకి మారు పేరు శాయి అని నాకు అతనితో గల పరిచయంతో అనిపిస్తూంటుంది. తన ఆదర్శాలకి కట్టుబడి దాన్ని నడుపుతున్నారు తప్ప, ఎలాంటి పరిస్థితుల్లో వాటిని శాయి సడలించరు గాక సడలించరు. అది ఆయన వ్యక్తిత్వంలో ఓ భాగం. ఇందుకు ఉదాహరణగా బాల చెప్పింది ఇక్కడ ఉదహరిస్తాను.

ఇద్దరూ వైజాగ్ నుంచి రైల్లో వస్తున్నారు. శాయి గారి దగ్గర నియమిత బరువుని మించిన సామాను ఉండటం చూసి ఓ రైల్వే అధికారి ఆయన్ని ఆపారు. సెక్రటేరియట్‌లో సెటప్‌లు చేసే నైపుణ్యం గల బాల ఆయనతో లంచం మాట్లాడేసారు.

"కానీ తల్ప శాయి మూర్ఖుడండి. ఆయన్ని చలానా రాయమని కట్టాల్సిందంతా కట్టి రసీదు తీసుకున్నారు" బాల చెప్పాడు.

ఏది నిజాయితీ, నిబద్ధతో అది ప్రపంచానికి మూర్ఖత్వం కదా మరి!

**శ్రీ వర్మ**

ఈనాడు సండే సప్లిమెంట్‌ని మొదటి నుంచీ శ్రీ చలసాని ప్రసాదరావు ఎడిట్ చేసేవారు. వివిధ కలం పేర్లతో నేను వెయ్యికి పైగా ఆర్టికల్స్ పైనే అందులో రాసాను. అప్పట్లో అది దినపత్రిక సైజులో బ్లాక్ అండ్ వైట్‌లో వచ్చేది.

తర్వాత ఈనాడుని రంగుల్లో ముద్రించడం మొదలైంది. కలకత్తా నుంచి వచ్చే అమృత్ బజార్ పత్రిక అనే దినపత్రిక తమ సండే సప్లిమెంట్‌ని 24 (32) పేజీలతో రంగుల్లో వీక్లీ సైజ్ పుస్తకరూపంలో తీసుకురావడం అప్పట్లో సంచలనం. ఈనాడు కూడా అదే పద్ధతిలో సండే సప్లిమెంట్‌ని తీసుకు వచ్చే ప్రయత్నం జరుగుతోందని శ్రీ చలసాని చెప్పారు. (రంగుల్లో దినపత్రిక వస్తే దాని ఖరీదు పెరిగి పాఠకుల మీద ఆర్థిక భారం పడుతుందని కొందరు విమర్శించారు కూడా. ఈనాడు పోటీని తట్టుకోడానికి తాము కూడా రంగుల్లో పేపర్‌ని తీసుకువచ్చే ఆర్థిక వనరులు, సత్తాలేని వారి నుంచి ఈ విమర్శ మొదలైంది.) సండే సప్లిమెంట్ కంటెంట్‌ని శ్రీ రామోజీరావు వ్యక్తిగత శ్రద్ధతో రూపొందిస్తున్నారని, కాబట్టి తనని ఎడిటర్‌ని చేయలేదని శ్రీ చలసాని చెప్పారు. వర్మ అనే అతను దానికి వర్కింగ్, ఇన్‌ఛార్జ్ ఎడిటర్ అయ్యారు. శ్రీ చలసాని ద్వారానే శ్రీ వర్మ నాకు వారి ఆఫీస్ ప్రాంగణంలో పరిచయం. శ్రీ రామోజీరావు రూపొందించిన ఫార్ములాతో ఈనాడు సండే సప్లిమెంట్ వారపత్రిక సైజులో, రంగుల్లో 1980ల ప్రథమార్థంలో ఆరంభమైంది. శ్రీ వర్మ ఆ ఫార్ములా ప్రకారం అనేకమంది రచయితలతో ఆ శీర్షికలని రాయించేవారు. అందులో కవర్ పేజీ ఆర్టికల్స్ వచ్చేవి. ఓ యదార్థ క్రైం స్టోరీ, సమరం సెక్స్ ఆర్టికల్, సైకాలజీకి సంబంధించిన వ్యాసాలు మొదలైనవి ఉండేవి. కథలు మాత్రం రచయిత పేరుతో బయటికి వచ్చేవి. శ్రీ పాలకోడేటి, శ్రీధర ఇంకా మరికొందరి చేత ఆ ఆర్టికల్స్ రాయించేవారు. శ్రీ వర్మ ఎన్నడూ నన్ను ఏ శీర్షికా రాయమని కోరలేదు. కానీ కనబడినప్పుడల్లా ఒకరినొకరం విష్ చేసుకునేవాళ్ళం. ఒకోసారి ఓ నిమిషం మాట్లాడుకునే వాళ్ళం కూడా.

2002లో మొదటిసారిగా నేను ఈనాడు సండే సప్లిమెంట్‌కి ఓ కథని పోస్ట్ చేసాను.‘ధ్యానం చేసి చూడు‘ అనే ఆధ్యాత్మిక కామెడీ కథ అది. తిరుగు టపాలో దాన్ని ప్రచురిస్తున్నామని శ్రీ వర్మ నుంచి ఉత్తరం వచ్చింది. అందులో తను సండే సప్లిమెంట్ నుంచి తప్పుకుంటున్నానని కూడా రాసారు. బహుశా ఆయన ఎడిట్ చేసిన ఆఖరి సంచిక అనుకుంటా అది. అందులో ఈ కథని ప్రచురించారు. ఆ తర్వాత సండే సప్లిమెంట్‌కి ఎవరు ఎడిటర్ అయ్యారో నాకు తెలీదు.

***కృష్ణవేణి***

కొద్ది నెలల తర్వాత ఈనాడు ఆఫీస్, సండే సప్లిమెంట్ విభాగం నుంచి నాకు ఫోన్ వచ్చింది.

"నా పేరు కృష్ణవేణి. నేను సండే సప్లిమెంట్ ఇన్‌ఛార్జ్ ఎడిటర్‌ని. మీతో పని పడింది. ఓసారి మా ఆఫీస్‌కి వచ్చి నన్ను కలుస్తారా?" అడిగారు.

వారిని కలిసాక ఆమె చెప్పింది.

"మిమ్మల్ని ఏం అడగాలో నాకు స్పష్టత లేదు. కానీ మా పత్రికకి మీ కాంట్రిబ్యూషన్ అవసరం. మీరు ఏం రాయగలరో చెప్పండి. అది వారం వారం నిర్వహించే కాలం అయితే మరీ మంచిది."

నేను ప్రిపేర్ అయి వెళ్ళడంతో కొన్ని శీర్షికలని సూచించాను. వాటిని కాగితం మీద పెట్టి ఇస్తే తనకి అర్థమౌతుందని ఆమె చెప్పారు.

"మీరు ఎప్పుడు వాటిని తయారుచేస్తే అప్పుడు మీ ఇంటికి మా మనిషిని పంపుతాను. అతనికి ఇవ్వచ్చు. వారం వారం అతనే వచ్చి కలెక్ట్ చేసుకుంటాడు" ఆమె చెప్పారు.

నేను కొద్దిగా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, ఈనాడు రెగ్యులర్ కాలమిస్ట్‌లు అక్కడికి వచ్చి రాయాలనే నిబంధన ఉండేది. శ్రీ పాలకోడేటి, శ్రీధర భూ భ్రమణం అనే డైలీ శీర్షికని అక్కడే కూర్చుని రాయాలనే నిబంధనని పాటించేవారని నాకు తెలుసు. అయితే

ఈనాడు ఇచ్చే ఇంగ్లీష్ మెటీరియల్‌ని వారు తెలుగులోకి అనువాదంచేసేవారు. కాబట్టి వాటిని బయటకి ఇవ్వడం ఇష్టంలేక అక్కడే రాయమనేవారు. కానీ సొంతంగా రాస్తూండటంతో ఆ నిబంధన నాకు వర్తించకపోవచ్చు అనుకున్నాను. శ్రీ రామోజీరావు ఫిల్మ్ సిటీ వ్యవహారాలు చూసుకుంటూ ఈనాడు బాధ్యతని తన పెద్ద కొడుకు కిరణ్‌కి అప్పటికే అప్పగించేసారు కాబట్టి బహుశా పద్ధతులు మారాయి అనుకున్నాను.

"నేను చాలా ఏళ్ళుగా వార్త సండే సప్లిమెంట్‌లో 'మల్లాది పేజీ' అనే శీర్షికని నిర్వహిస్తున్నాను. ఈనాడుకి రాసేవారు బయటి పత్రికలకి రాయకూడదు అనే నిబంధన ఉంది కదా. మరి ఎలా?" ప్రశ్నించాను.

ఇందుకు ఓ కారణం ఉంది. 2001లో అనుకుంటే. ఈనాడులో కొత్తగా అంతర్యామి అనే ఆధ్యాత్మిక శీర్షికని ఆరంభించిన కొద్దినెలలకి ఓ రోజు ఈనాడుకి ఫోన్ చేసి దాన్ని నిర్వహించే ఎడిటర్ బాల అనే అతనికి నన్ను పరిచయం చేసుకుని 'నేను ఆ శీర్షికకి రాయచ్చా?' అని అడిగాను.

"మీ పేరు నాకు సుపరిచితమే. కానీ బయటికి పత్రికలకి రాసేవారు మాకు రాయకూడదనే నిబంధన ఉంది కాబట్టి సారీ!" అని చెప్పారు. కానీ ఆ అంతర్యామి కాలంలో సామవేదం షణ్ముఖ శర్మ రాసేవారు. ఆయన ఋషిపీఠం అనే ఆధ్యాత్మిక పత్రికకి ఎడిటర్. శ్రీ కాటూరి రవీంద్ర త్రివిక్రం అనే బయట పత్రికలకి ఆధ్యాత్మిక రచనలని చేసే రచయిత రచనలు రావడం కూడా గమనించాను. అయినా శ్రీ బాలతో వాదించడం ఇష్టం లేక ఫోన్ పెట్టేసాను. ఆ విషయం శ్రీమతి కృష్ణవేణికి చెప్పాను.

"మా సెక్షన్ వరకూ అలాంటి నిబంధన లేదు. మీరు వెంటనే ఇస్తే వచ్చే సంచికనించే వాటిని తీసుకుంటాను. నేను లైబ్రేరియన్‌గా పని చేసేదాన్ని. ఇప్పుడు ఈనాడు సండే సప్లిమెంట్‌కి ఎడిటర్ ఇన్‌ఛార్జిని అయ్యాను. ఏమైనా చిక్కు లెక్కలు దొరుకుతాయా అని లైబ్రరీలో చూస్తే నాకు మంచి పుస్తకాలేవీ కనబడలేదు. అలాంటివి మీ దగ్గర ఉన్నాయా?" కృష్ణవేణి అడిగారు.

"నేను నాలుగు వారాలు ఇన్‌స్టాల్‌మెంట్స్ అప్రూవ్ అయ్యాక ముందే ఇస్తాను. తర్వాత ప్రతివారం ఓ ఇన్‌స్టాల్‌మెంట్ ఇస్తాను. ఇందువల్ల ఏ కారణంగానైనా రెండు మూడు వారాలు మిస్సయినా శీర్షిక ఆగదు. వార్త సండే సప్లిమెంట్‌కి కూడా ఇదే పద్ధతిని పాటిస్తున్నాను" చెప్పాను.

"నేను మీ గురించి వాకబు చేసే మిమ్మల్ని కాంటాక్ట్ చేసాను. మీ ట్రాక్ రికార్డ్‌లో మీకు క్రమశిక్షణగా ఓ పద్ధతిగా ఉంటారని తెలిసింది. ఆ విషయంలో ఎలాంటి అనుమానం ఉన్నా మిమ్మల్ని కాంటాక్ట్ చేసేదాన్ని కాదు" చెప్పారు.

నాకున్న ఆలోచనలని ఆమెతో చర్చించాక, పేడ్ మీద నేను చెప్పిన శీర్షికలని పేజ్ మేకప్‌గా నా ముందే గీసి చూసుకున్నారు. నచ్చిన వాటికి టిక్‌లని కూడా పెట్టుకున్నారు. 'మీరు వివరంగా పంపిస్తే, కంపోజ్ చేసి కాగితం మీద చూసుకుని ఏ సంగతి మీకు చెప్తాను' చెప్పారు.

నేను వెళ్ళబోయే ముందు శ్రీమతి కృష్ణవేణి నాకు న్యూస్ ప్రింట్‌తో చేసిన కొన్ని పేడ్‌లని రాయడానికి ఇచ్చారు. ఇది దేనికని అడిగితే, 'మా రచయితలందరికీ ఇలా పేడ్స్ ఇవ్వడం అలవాటు' అని చెప్పారు. కానీ నేను దాన్ని తీసుకోలేదు. రచయిత పెట్టే ఖర్చు ఒక్క కలం, కాగితాలకే కదా.

నేను సండే సప్లిమెంట్‌లో ఓ పేజీకి సరిపడే ఏడెనిమిది ట్రివియా (టిట్ బిట్స్) శీర్షికలని, ఓ పదకేళిని డిజైన్ చేస్తే వారి మనిషి వచ్చి ఆ కవర్ని తీసుకువెళ్ళాడు.

ఆమె చెప్పిన డెడ్ లైన్ గడిచినా నాకు ఆమెనుంచి మాట ఇచ్చినట్లుగా ఫోన్ రాలేదు. రెండు రోజులు ఆగి కృష్ణవేణికి ఫోన్ చేసాను.

"ఏమిటి? చెప్పండి." అన్నారు ఆమె.

నాకు ఆశ్చర్యం వేసింది. మొదట చూపించిన ఉత్సాహం ఆమె జవాబులో కనపడలేదు.

"నేను పంపిన శీర్షికల గురించి ఏం నిర్ణయించారు?" అడిగాను.

నాకు సరైన సమాధానం రాలేదు. నేను సూచించిన ఓ శీర్షిక 'సిల్లీపాయింట్' అనే పేర ఆ తర్వాత ఈనాడు సండే సప్లిమెంట్‌లో ఆరంభం అయింది. ఐతే అప్పటికే చాలా పత్రికల్లో అలాంటివి వచ్చినా ఇలా శీర్షికగా తెచ్చింది కృష్ణవేణిగారే. ఇప్పుడు చాలా పత్రికల్లో ఆ శీర్షిక వస్తోంది.

2004లో మళ్ళీ ఓ రోజు కృష్ణవేణి గారినుంచి ఫోన్ వచ్చింది.

"నేను కృష్ణవేణిని. ఎలా ఉన్నారు? మీరోసారి నన్ను కలవగలరా?"

నేను కలిసాక ఆమె కోరింది.

"ఈనాడు సండే సప్లిమెంట్ లో మొదటి నుంచి క్రైమ్ పేజీని వేస్తున్నాం. అయితే ఇటీవల దాన్ని నేను ఆపేసాను. ఎందుకాపారు అని చాలా ఉత్తరాలు వచ్చాయి. యదార్థ నేర కథలు కాక ఇంకేదైనా క్రైం నేపథ్యంతో ఓ శీర్షికని మీరు ఆ పేజీలో నిర్వహించగలరా? దాన్ని తక్షణం ప్రారంభించాలి."

నేను రెండు రకాల క్రైమ్ క్విజ్‌లని, ఓ క్రైం కథని కాగితం మీద పెట్టి పంపాను.

ఆమె చెప్పిన డెడ్ లైన్ తర్వాత నాకు మళ్ళీ ఫోన్ రాలేదు. నేను వారం తర్వాత ఫోన్ చేస్తే ఎప్పటిలానే "ఏమిటి? చెప్పండి?" అన్నారు.

నా శీర్షిక మీద ఏ నిర్ణయం తీసుకున్నారని అడిగితే సరైన సమాధానం లేదు. ఏ కారణంగానైనా రిజెక్ట్ చేస్తే ఆ సంగతి చెప్పడానికి ఆమెకి కొంత ఇబ్బంది ఉండచ్చు అని నాకు అనిపించింది. ఆ శీర్షికని నవ్య వీక్లీకి ఇచ్చాను. డిటెక్టివ్ క్విజ్ పేరున నవ్య వీక్లీలో చాలాకాలం ఆ శీర్షిక వెలువడింది. శ్రీమతి కృష్ణవేణితో గల ఇలాంటి అనుభవం నాకు అదే మొదటి సారి, ఆఖరుసారి.

ఆ తర్వాత రెండేళ్ళకి స్టాలిన్ అనే కథని ఈనాడు సండే సప్లిమెంట్‌కి పంపాను. దాన్ని త్వరగా వేయడమే కాక, శనివారం సాయంత్రమే ఓ మనిషి తెచ్చిచ్చిన కవర్లో మర్నాడు రాబోయే ఆ సంచిక ఉంది. రచయితకి బాగా ఆనందాన్ని ఇచ్చేవి కథని ప్రచురిస్తున్నామని తెలియచేసే ఉత్తరం, ప్రచురించబడ్డ సంచిక కొనక్కర్లేకుండా దాన్ని ఆ పత్రిక వారినుంచి అందుకోవడం అని ఏ రచయితని అడిగినా చెప్తారు. పారితోషికం స్థానం మూడోదే. శ్రీమతి కృష్ణవేణి రచయితలకి ఇచ్చే ఈ గౌరవం తెలుగులో మరే సండే సప్లిమెంట్ ఎడిటర్, కాని వీక్లీ ఎడిటర్ కాని ఇవ్వటంలేదు - స్వాతి వీక్లీ మినహాయిస్తే. ఇది ఆమెలోని చక్కటి సంస్కారాన్ని ప్రతిబింబించే చర్య.

ఇటీవల కొన్ని క్రైమ్ కథలని తెలుగులోకి అనువదించాను. అవి నాకు బాగా నచ్చిన కథలు కాబట్టి ఎక్కువమంది పాఠకులు చదవాలనే ఉద్దేశంతో శ్రీమతి కృష్ణవేణికి వాటిని గురించి ఇ-మెయిల్ పంపి, 'మీ పత్రికలో క్రైమ్ శీర్షిక లేదు కాబట్టి అనువాద కథలని వేసే అవకాశం ఉందా?' అని అడిగాను. కొన్ని పంపమంటే పంపాను. కానీ అవి బొమ్మతో కలిపి రెండు పేజీలు దాటచ్చని వారు నిరాకరించారు.

***(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)***

Click here to share your comments on this story